

సాక్షి
పల్నాడు
బుధవారం । 12 । మార్చి । 2025



ఎకో పార్కులోకి ప్రవేశం ఉచితం

మంగళగిరి: ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన ఉన్న టెంపుల్ హిల్ ఎకో పార్కులోకి ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు జిల్లా అటవీ శాఖ అధికారి ఎం.హిమ శైలజ మంగళవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో కేంద్ర బృందం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను కేంద్ర అధికారుల బృందం మంగళవారం దర్శించుకుంది. సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. వేదాశీర్వచనం పొందారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
నరసరావుపేట	6.24	5.03
గుంటూరు	6.22	5.01
బాపట్ల	6.22	5.01

న్యూస్‌రీల్

రేపు ఎయిమ్స్‌లో వాక్‌థాన్




మంగళగిరి: నగర పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) ఆవరణలో వాక్‌థాన్ నిర్వాహకులు వి.నేహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా నెఫ్రాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 13న గురువారం ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు వాక్‌థాన్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఎయిమ్స్ ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించే సమావేశంలో కిడ్నీ ప్రాముఖ్యంపై అవగాహన కల్పించనున్నట్టు వివరించారు.

సాగర్ నీరు సాగు, తాగుకే వాడుకోవాలి

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువకు కృష్ణా బోర్డు కేటాయించిన నీటిలో మిగిలిన నీరు మార్చి చివరి వరకు మాత్రమే సరిపోయే అవకాశం ఉన్నందున వృథా చేయకుండా పంట పొలాలు, తాగునీటి చెరువులకు మాత్రమే ఉపయోగించాలని ఎన్ఎస్పీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణమోహన్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మే నెలలో తాగునీటి చెరువుల కోసం నీరు విడుదల చేసేంత వరకు కాలువలు మూసివేయనున్నట్టు చెప్పారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం, ప్రజారోగ్యశాఖల అధికారులు తాగునీటి చెరువుల్లోని నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.

రేపు సత్రశాలలో 16 రోజుల పండుగ




సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో గురువారం 16 రోజుల పండగ నిర్వహించనున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి మంగళవారం తెలిపారు. మహాశివరాత్రి పండగ వెళ్లిన 16 రోజుల తరువాత దేవస్థానంలో స్వామివార్ల కల్యాణం నిర్వహించి అనంతరం కనులపండువగా వసంతోత్సవం జరపడం ఆనవాయితీగా వస్తున్నట్లు వివరించారు.

వలస పక్షుల రాక

పెదకూరపాడు : కొల్లేరు ప్రాంతానికి విదేశీ పక్షులు రావడం అందరికీ తెలిసిన విషయమే. గుంటూరు జిల్లాలోనూ తక్కెళ్లపాడు చెరువుకు వలస పక్షులు రావడం సహజం. ఈ కోవలోనే పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరు గ్రామంలోని చెరువు కూడా వలస పక్షులకు ఆవాసంగా మారడంతో ప్రజలు పక్షులను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు గట్లపైన పండ్ల మొక్కలు నాటి సంరక్షిస్తే పక్షులకు ఆవాసాలుగా మారతాయని, తద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

యార్డులో 1,44,323 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,38,953 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,44,323 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది.

సంక్షేమం ఫ్రీజ్



అబద్ధాల విష వలయం చుట్టుముడితే.. ఆకాశానికి నిచ్చెన వేసి ఆశల పల్లకీలో ఊరేగిస్తే.. అరచేతిలో వైకుంఠం చూపి మంత్రదండంలా ఆడిస్తే నిజమని నమ్మిన సామాన్యుడు.. కాల 'కూటమి' చక్రబంధనంలో చిక్కుకున్నాడు.. అది మాయాచక్రమని తెలుసుకునే లోపు నివురుగప్పిన మోసం నిలువునా ముంచేసింది. బంగారు భవితను అంధకారం చేసింది. ఇంటికో ఉద్యోగం.. నిరుద్యోగ భృతి అంటూ యువగళంలో పోసిన గరళం అంపశయ్యపైకి చేర్చింది. తల్లికి వందనం పేరిట 'అమ్మఒడి'లో రేపిన మంట కార్చిచ్చులా చుట్టుముట్టింది. విద్యా దీవెనలు.. శాపాల శరాఘాతాలై నిలువెల్లా తాకాయి. ఫలితంగా దగా పడ్డ తెలుగుబిడ్డ ఆగ్రహజ్వాలతో గళమెత్తి గర్జిస్తున్నాడు. కూటమి సర్కారుపై కన్నెర్రజేసి ఖబడ్దార్ అంటూ హెచ్చరిస్తున్నాడు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో దళమై కదంతొక్కేందుకు సిద్ధపడ్డాడు.

- భారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెనకు మంగళం
- నిరుద్యోగ భృతి అడ్రస్ గల్లంతు
- ఉపాధి లేదు.. ఉద్యోగం రాదు..
- యువత తరఫున నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట
- ప్రతిపక్షానికి అన్నివర్గాల నుంచి విశేష మద్దతు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటికొక ఉద్యోగం ఇస్తాం.. యువతకు ఉపాధి కల్పిస్తాం.. సంపద సృష్టించి అభివృద్ధి చేస్తాం.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు భృతి ఇస్తామంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు, ముఖ్యంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా కొత్త ఉద్యోగం ఇవ్వలేదు. పైగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, ఇంజినీరింగ్, పీజీ ఇలా ఏదో ఒకటి పూర్తిచేసిన నిరుద్యోగులు ఐదు లక్షల 58 వేల మంది ఉన్నారని అంచనా. వీరికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. అయితే ఆ దిశగా సర్కారు చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగ భృతి ఊసే లేదు. బడ్జెట్లోనూ కేటాయింపులు చేయలేదు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ, తొలి సంతకం అంటూ ఆర్భాటం చేసిన చంద్రబాబు ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లూ ఇవ్వడం లేదు. ఫలితంగా యువత నిరసన గళం విప్పుతోంది.

బాబు వల్ల విద్యారంగం నిర్వీర్యం

బాబు పాలనలో విద్యారంగం నిర్వీర్యమైపో



తోంది. గత ప్రభుత్వంలో అమలైన ఫీజు రీయింబర్స్‌మెంట్(విద్యాదీవెన), వసతి దీవెన పథకాలు అటకెక్కాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నుంచి ఎప్పుడు బయటకు గెంటేస్తారో తెలీక విద్యార్థులు సతమతమవుతున్నారు. ఇప్పటికే చదువు పూర్తయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫలితంగా ఉద్యోగాల కోసం యత్నిస్తున్న వారు అవస్థలు పడుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ కాలేజీలకు ఫీజులు చెల్లిస్తున్నారు. అప్పులకు వడ్డీ భారం పెరుగుతున్నా.. సర్కారులో మాత్రం చలనం ఉండట్లేదు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా, ఫీజులు చెల్లిస్తేనే ఈ ఏడాది పరీక్షలకు అనుమతిస్తామని కళాశాలల నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ ఉద్యమబాట

వైఎస్సార్ సీపీ నిరుద్యోగ యువత, విద్యార్థుల పక్షాన ఉద్యమ బాట పట్టింది. ఫీజు రియంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం 'యువత పోరు' పేరుతో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టనున్నారు. జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో కొలువుల జాతర

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా జిల్లాలో సుమారు ఐదు వేల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా మరో ఐదు వందల మందికి ఉపాధి దొరికింది. చాలా మంది తమ సొంత గ్రామాలు, సొంత మండలాల్లో ఉపాధి పొందారు. అప్పట్లో హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న వారు సొంత ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం గమనార్హం. ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన గతంలో ఎన్నడూ జరిగిన దాఖలాలు లేవు. వైద్య ఆరోగ్య శాఖలో రెండు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించారు. అలాగే ఇతర శాఖల్లో శాశ్వత, కాంట్రాక్టు పోస్టులు భర్తీ చేశారు. అప్కాస్ పేరిట వేలాది మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారు. అలాగే స్థానిక యువతకు వలంటీర్ వ్యవస్థ ద్వారా భారీగా ఉపాధి కల్పించడం విశేషం. జిల్లాలో సుమారు పది వేల మందికిపైగా మంది వలంటీర్లుగా సొంత గ్రామంలో ఉపాధి పొందారు. ప్రజల ముంగిళ్లలోకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లారు.

ఉద్యోగం కోసం నిరీక్షణ



నేను బీటెక్ పూర్తి చేశా. ఎలాంటి ఉద్యోగం లేకపోవడంతో హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సులో శిక్షణకు వెళుతున్నా. జనవరిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటనా చేయటం లేదు. అధికారంలోకి వచ్చే వరకు ఒక మాట. ఇప్పుడొక మాట. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తోంది.

– వల్లెం ఈశ్వర్ సాయికుమార్, నిరుద్యోగి, సత్తెనపల్లి

పచ్చి మోసం



టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతను పచ్చి మోసం చేస్తోంది. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ వసతి దీవెనకు రూ.1,800 కోట్లు మంజూరుచేశారు. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు ఏమీ మంజూరు చేయలేదు. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టి, ఐదింటిలో తరగతులు ప్రారంభిస్తే ఈ సర్కారు వాటిని ప్రైవేటు పరం చేసేందుకు పావులు కదుపుతోంది. ఇంటికో ఉద్యోగం అని చెప్పి ఇప్పటివరకు కొత్తగా ఒక్క జాబ్ కూడా ఇవ్వలేదు. పైగా ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నారు.

– గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ

తల్లికి వందనం ఎక్కడ?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. గతంలో నాలుగేళ్లపాటు నిరాటంకంగా అమలైన జగనన్న అమ్మ ఒడి ఆర్థిక ప్రోత్సాహం ఆగిపోయింది. ఏటా తల్లుల ఖాతాల్లో జమైన రూ.15వేలు పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. కరోనా సంక్షోభంలోనూ అమ్మఒడి ఆగలేదు. కూటమి సర్కారు వచ్చాక తల్లికి వందనం అని చెప్పి మొత్తంగా ఎగ్గొట్టారు.

నిలువునా ముంచింది



విద్యార్థులు, యువతను కూటమి ప్రభుత్వం నిలువునా ముంచింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ఇబ్బంది పెడుతోంది. ఉద్యోగాల భర్తీ లేదు. మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు యత్నిస్తోంది. సర్కారుపై పోరు గళం విప్పుతాం. ఏపీ కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి. జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ స్టూడెంట్లకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి. వెటర్నరీ విద్యార్థులకు రూ.25వేల స్టైఫండ్ చెల్లించాలి,

– కోట సాయికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్

దిక్కుతోచని స్థితిలో పేద వర్గాలు



టీడీపీ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో పేదవర్గాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పిల్లల చదువులు ఆగిపోయే దుస్థితి నెలకొంది. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు ఇప్పుడు పెదవి విప్పడం లేదు. ఇంటికో ఉద్యోగం అన్నారు గానీ ఒక్క జాబూ భర్తీ చేయలేదు. ఈ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉంది.

– కందుల శ్రీకాంత్, యువజన విభాగ జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ

గత ప్రభుత్వంలో క్యాలెండర్ ప్రకారం..

గత ప్రభుత్వంలో జగనన్న విద్య దీవెన, వసతి దీవెనకు సంబంధించిన నిధులను ప్రతి మూడు నెలలకొకసారి క్యాలెండర్ ప్రకారం విడుదల చేసేవారు. దీంతో ఫీజు బకాయిలు లేకుండా సకాలంలో కాలేజీలకు చెల్లించేవాళ్లం. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేయకుండా ఉండేవి. కానీ ప్రస్తుతం ఆ విధంగా చెల్లింపులు జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే చర్యలు చేపట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి.

– రామసాయి, విద్యార్థి, బీటెక్ థర్డ్ ఇయర్

ఫీజుల కోసం అవస్థలు



ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చెప్పిన సమయానికల్లా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

– కొత్తపల్లి ప్రసాద్, సర్పంచ్, గుండ్లపల్లి

ఉన్నత విద్యకు పేదలు దూరం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్నత విద్య చదువుకోవాలనుకున్న పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం కళాశాల విద్య చదువుతున్న వారి ఫీజు ఇంకా చెల్లించలేదు. వచ్చే ఏడాది నుంచి కళాశాలలో చేరదామంటే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చెల్లిస్తుందన్న గ్యారంటీ లేదు. దీంతో పేద తల్లిదండ్రులు తమ పిల్లలను కాలేజీల్లో చేర్చాలంటే ఆందోళన చెందుతున్నారు.

– జక్కిరెడ్డి కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, చల్లగుండ్ల

లీకు లాగితే కదిలిన డొంక

వివేకానంద బీఈడీ కళాశాల అక్రమాలెన్నో..

- ప్రశ్నపత్రం లీక్‌తో గుట్టురట్టు
- విద్యార్థుల జీవితాలతో యాజమాన్యం చెలగాటం
- ఏళ్ల తరబడి ఇదే తంతు



వినుకొండలోని బీఈడీ కళాశాల

వినుకొండ: వినుకొండలోని వివేకానంద బీఈడీ కళాశాల వేదికగానే బీఈడీ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్టివ్ ప్రశ్నాపత్రం లీక్ కావడం సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సంస్థ అక్రమాల డొంక కదులుతోంది. తొలి నుంచి కళాశాలలో అడ్మిషన్ దగ్గర నుంచి సర్టిఫికెట్లు మంజూరు చేసే వరకు అవినీతి దందా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏటా డీఎస్సీ లేకపోవడం, టీచర్ పోస్టులు ఖాళీ లేకపోవడం వల్ల ఇక్కడ బీఈడీకి ప్రాధాన్యం తగ్గిపోయింది. అయితే ఈ కోర్సుకు ఒడిశా, ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని వివేకానంద కళాశాల యాజమాన్యం ఒడిశా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పిస్తోంది. ఏజెంట్ల ద్వారా అడ్మిషన్లు పొందిన ఒడిశా, ఇతర రాష్ట్రాల విద్యార్థులు లంచాలు సమర్పించి కళాశాలకు రాకుండా హాజరు వేయించుకుంటున్నారని తెలుస్తోంది. కొన్నేళ్ల నుంచి ఈ దందా సాగుతోందని సమాచారం. గతంలో ఇక్కడ విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చి మరీ పరీక్షలు రాయించేవారు. మారిన నిబంధనల ప్రకారం 2024 నుంచి ప్రశ్నాపత్రం ఆన్‌లైన్‌లో పంపిస్తుండడంతో కళాశాల యాజమాన్యం పరీక్ష సమయానికంటే ముందే ప్రశ్నాపత్రాలు లీక్ చేసి ఒడిశా విద్యార్థులకు రూ.లక్షలకు అమ్ముకుంటున్నట్టు సమాచారం. తాజాగా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాస్పెక్టివ్ పేపర్ లీక్ విషయం బయటకు పొక్కడంతో వివేకానంద కళాశాల యజమాని సయ్యద్ రఫీక్ అహ్మద్‌తో పాటు కళాశాల కంప్యూటర్ ఆపరేటర్ మరి కొంత మంది సిబ్బందిని గుంటూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న ఈ కళాశాలలో ఈ తంతు ఏటా గుట్టుగా జరుగుతూనే ఉందని సమాచారం. ఇదిలా ఉంటే లీకైన ప్రశ్నాపత్రాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. మళ్లీ బుధవారం పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది.

తొలి నుంచీ అదే తీరు

వినుకొండ వివేకానంద బీఈడీ కళాశాల కరస్పాండెంట్ సయ్యద్ రఫీక్ అహ్మద్ పై గతంలోనూ ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. కేసులూ ఉన్నాయి. రాష్ట్ర విభజనకు పూర్వం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులకు లంచాలు ఇస్తూ ఏసీబీకి పట్టుబడిన కేసులు నడుస్తున్నాయి. తాజాగా వినుకొండలో పేపర్ లీకేజీ వ్యవహారం బయటకు పొక్కడంతో ఈ కళాశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాజాగా కబ్జా!

- కాదేదీ కబ్జాకు అనర్హం
- జగనన్న కాలనీలో స్థలం స్వాహా
- 70 సెంట్లు కాజేసిన టీడీపీ నేతలు
- బయటకు చెబితే చంపేస్తామని బాధితులకు బెదిరింపులు
- ఎమ్మెల్యే యరపతినేని అనుచరుల దురాగతం
- న్యాయం చేయాలని కోరుతున్న లబ్ధిదారులు



పులిపాడు గ్రామంలో టీడీపీ నాయకులు కబ్జా చేసిన స్థలం

గురజాల రూరల్: గురజాల నియోజకవర్గంలో కూటమి నేతల కబ్జాల పర్వం దర్జాగా కొనసాగుతోంది. జాగా కనిపిస్తే చాలు నాయకులు వాలిపోతున్నారు. జెండా పాతేస్తున్నారు. చివరికి పేదల స్థలాలనూ వదలడం లేదు. అధికారం అండతో విచ్చలవిడిగా నకిలీ దస్తావేజులను సృష్టించి స్థలాలను స్వాహా చేసేస్తున్నారు.. మండలంలోని పులిపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు జగనన్న కాలనీ ఏర్పాటు చేసి మంజూరు చేసిన స్థలంపైనా టీడీపీ నేతలు, ఎమ్మెల్యే యరపతినేని అనుచరుల కన్నుపడింది. ఎలాగైనా ఆక్రమించాలన్న దురుద్దేశంతో రాత్రికి రాత్రి పొక్లెయిన్‌తో చదును చేసేశారు. వెంటనే గ్రామ రెవెన్యూ అధికారి నుంచి స్థలంలో తామున్నామని ధ్రువీకరణ పత్రం పొందారు.

బెదిరింపుల పర్వం

కబ్జా చేసిన విషయం ఎవరైనా బయటకు చెప్తే వారి అంతు చూస్తామని టీడీపీ నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తమదని, తమ ఇష్టం వచ్చినట్లు తాము చేస్తామని, కలెక్టర్‌కు చెప్పినా తమకు ఎదురులేదని అంటున్నారని బాధితులు లబోదిబోమంటున్నారు.

మొత్తం 70సెంట్లు హాంఫట్!

పులిపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 761/3, 766, 786/3బీ, 786/3–సీ, 786/3–డీ2, 786/3డి4, 786/5, 786/4 సర్వే నంబర్లలో 70 సెంట్ల భూమిని 40 మంది నిరుపేదలకు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే యరపతినేని అనుచరులు తొమ్మిది మంది కన్ను ఆ స్థలంపై పడింది. వెంటనే అసలు సర్వే నంబర్లు కాకుండా 761/3బీ సర్వే నంబరు వేసుకుని ఐదుగురు ఒక్కొక్కరు 9 సెంట్ల చొప్పున, ఇద్దరు 7 సెంట్ల చొప్పున, ఒకరు 6 సెంట్లు, ఒకరు ఐదు సెంట్లు ఆక్రమించుకున్నారు. గ్రామ వీఆర్వో వద్ద గ్రామకంఠం నంబరు వేసుకుని ధ్రువీకరణ పత్రం పొందారు. ఈ ధ్రువీకరణ పత్రంతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే సహించేది లేదని హుకుం జారీ చేశారు.

టీడీపీ నేతలు కబ్జా చేశారు



ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కేటాయించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేదు. కూటమి అధికారంలోకి రాగానే మా స్థలంపై టీడీపీ నాయకుల కన్ను పడింది. ఆ స్థలాన్ని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇల్లు కట్టుకుందామని ఎంతో ఆశపడ్డాం కానీ ఆ ఆశ నెరవేరేలా లేదు.

– పిండం లక్ష్మి, పులిపాడు

ప్రభుత్వం న్యాయం చేయాలి



గత ప్రభుత్వం హయాంలో మాకు జగనన్న కాలనీలో స్థలం కేటాయించారు. ఈ ప్రభుత్వంలో రుణం ఇస్తే ఇంటి నిర్మాణం చేసుకుందామని అనుకున్నాం. ఇంతలోనే టీడీపీ నాయకులు మా స్థలాన్ని కబ్జా చేశారు. అదేమంటే స్థలం తమదని బెదిరిస్తున్నారు. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి. మావి రెక్కాడితేగానీ డొక్కాడని జీవితాలు. దయ ఉంచి ప్రభుత్వం న్యాయం చేయాలి.

– కూరాకుల రమాదేవి, పులిపాడు

పది దూరవిద్య పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పదో తరగతి దూరవిద్య పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పరీక్షల నిర్వహణపై శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ చంద్రకళ మాట్లాడుతూ పరీక్షలు ఈనెల 17 నుంచి 28 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో 27 పరీక్ష కేంద్రాలలో 1,200 మంది పరీక్షకు హాజరు కానున్నట్టు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 57 మంది ఇన్విజిలేటర్లను నియమించామని పేర్కొన్నారు. 28 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని చెప్పారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ కరదీపికను సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్, డెప్యూటీ డీఈఓలు ఎస్.ఎం.సుభాని, వి.ఏసుబాబు, రిసోర్స్ పర్సన్ బీవీఎల్ వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

క్లుప్తంగా

పీ-4 సర్వే వేగవంతం చేయాలి



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): గ్రామాల్లో జరుగుతున్న పీ–4 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా గ్రామంలోని రెండు గృహాలను సందర్శించి కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారి సమగ్ర వివరాలు నమోదు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. నీటి కుంట నిర్మాణపు పనులను పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పించేలా పనులు గుర్తించి అమలు చేయాలని చెప్పారు. తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో కాశయ్య, ఇన్‌చార్జి ఏపీడీ వెంకటనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు నివారించాలి

వైద్యాధికారులకు సూచించిన డీఎంహెచ్‌వో



సమీక్ష చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలో మాతా, శిశు మరణాలు చోటు చేసుకోకుండా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో మాతృ, శిశు మరణాలపై సమీక్ష చేశారు. శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అరేపల్లి ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో చోటుచేసుకున్న రెండు మాతృ మరణాలు, రామిరెడ్డిపేట యూపీహెచ్‌సీ, సత్తెనపల్లి, వినుకొండ కో–లొకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలలో జరిగిన మూడు శిశు మరణాలు సంభవించడానికి గల కారణాలను వైద్యాధికారులు, కాన్పులు నిర్వహించిన ప్రైవేటు వైద్యశాల నుంచి హాజరైన గైనకాలజిస్ట్, అనస్తీష్టు, చిన్నపిల్లల వైద్యులను విచారించి మరణాలకు దారితీసిన కారణాలు తెలుసుకున్నారు. గర్భిణులు పోషకాహారం, హిమోగ్లోబిన్ శాతం, గర్భస్థ శిశువు కదలికలన్నింటినీ తెలుసుకునేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేసే అల్ట్రా సోనోగ్రఫీ, టిఫ్ పరీక్షలను చేయించుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, డాక్టర్ మంత్రునాయక్, డాక్టర్ లక్ష్మణరావు, డీపీహెచ్ఎన్‌వో బి.సురేఖ, ఏఎన్ఎం, ఆశాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చదలవాడ చర్యలు నీతి బాహ్యం

- టీడీపీ ప్రభుత్వ వేధింపుల్లో భాగమే నాపై కేసు
- కోడెల శివరాం అక్రమాలపై ఫిర్యాదు చేసిన వారే మాట మార్చారు!
- వినుకొండరోడ్డు వెంచర్‌లో ప్రభుత్వ భూమిలేదని అధికారులు తేల్చారు
- కోటప్పకొండలోని నాయీ బ్రాహ్మణుల భూమిలో ఎమ్మెల్యే మట్టి తవ్వకాలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట టీడీపీ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చర్యలు నీతిబాహ్యంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అసలు ఆయన అధికారపక్షంలో ఉన్నరా, ప్రతిపక్షంలో ఉన్నారో నియోజకవర్గ ప్రజలకు అంతుబట్టడంలేదని అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ రెండు రోజుల క్రితం ప్రభుత్వ కార్యాలయమైన ఎక్సైజ్ కమిషనరేట్‌లో ధర్నా చేయడం, ఆ పార్టీ నాయకులు వారించినా లెక్క చేయకపోవడం, అధికారులను ఇబ్బంది పెట్టడం సముచితంగా లేదన్నారు. గత 20 ఏళ్లుగా అనేకమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులు అనేక ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్నారని, వారందరూ ఒకే పార్టీకి చెందిన వారు కాదని, వీరి కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆప్కాస్ ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ భద్రతను కల్పించిందన్నారు. కేవలం ప్రతిపక్షానికి చెందిన వారనే నెపంతో 11 కుటుంబాల వారిని అన్యాయంగా తీసివేయాలనుకోవటం దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. ఈ ఎమ్మెల్యే మాట నరసరావుపేట, రొంపిచర్ల తహసీల్దార్లు వినడం లేదని తాను చెప్పిన పనులు చేయడం లేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వటం బట్టి చూస్తే ఇతని మాట అధికారులు వినటం లేదేమో అనే వాదన ప్రజల్లో బలపడుతుందన్నారు. పట్టణంలో అనుమతి లేకుండా లేఅవుట్లు గత ప్రభుత్వంలో వేశారని చెబుతున్నారని, ఇప్పుడు తొమ్మిది నెలల కాలంలో అనేక అన్‌ఆథరైజ్డ్ లే అవుట్లు వెలిశాయని చెప్పారు. దీనికి తన వద్ద రుజువు కూడా ఉన్నాయని, తాను రుజువు చేయగలనని దీనికి మీరు ఏం సమాధానం చెబుతారని సూటిగా ప్రశ్నించారు.

కోటప్పకొండ దేవుని మాన్యంలో మట్టి తోలుకుంటున్నారు

కోటప్పకొండ దేవస్థానంకు సంబంధించిన ఆరున్నర ఎకరాల దేవదాయ భూమిని నాయీ బ్రాహ్మణులకు కేటాయిస్తే ఆ భూమిని ఆక్రమించుకొని ఎమ్మెల్యే, ఆయన మనుషులు మట్టి తోలుకుంటున్నారని చెప్పారు. స్వయానా ఈ మట్టితవ్వే భూములను పరిశీలించిన కోటప్పకొండ ఈవో ఇది దేవస్థానానికి సంబంధించిన భూమి అని నిర్ధారించారన్నారు. అక్కడ ఉన్న వాహనాలను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారన్నారు. ఇంత జరిగినా మళ్లీ అసెంబ్లీలో అతనే ప్రస్తావించటాన్ని చూస్తే అతనికి నైజం ఏమిటో అర్థమౌతుందన్నారు. ఎనిమిది అడుగుల లోతు మట్టి తీసి అమ్ముకున్నారని, ఇప్పుడు ఈ గుంటలు పడ్డ భూమి సాగుకి, దేవదాయ శాఖకు పనికి రాదని ఇప్పుడు ఈ భూమికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఎవరు భరిస్తారని దీనికి ఎమ్మెల్యేనే సమాధానం చెప్పాలని కోరారు.

కోడెల శివరామ్‌పై కేసులతో నాకు సంబంధం లేదు

కోడేల శివరాం అభిమానుల పేరుతో తనపైన, విజయసాయిరెడ్డిపై శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ఎవారిపేట గ్రామానికి చెందిన ఆంధ్ర మాజీ రంజీ క్రికెటర్ నాగరాజు అనే వ్యక్తి టీడీపీ నాయకులు కేసు పెట్టించారని అన్నారు. అయితే అతనెవరూ, అతని ఊరు, మండలం కూడా తమకు తెలియదన్నారు. 2019లో అధికారం వచ్చిన తర్వాత ఈ నాగరాజు అనే వ్యక్తి తన వద్దకు వచ్చి నేను శివరాంకు రూ.15 లక్షలు లంచంగా ఇచ్చానని, నా డబ్బు నాకు ఇప్పించదని వేడుకున్నాడన్నారు. అతడిని పోలీసుల వద్దకు పంపటం జరిగిందన్నారు. కేసులు పెట్టింది కోడెల శివరాంపైనే కాని కోడెలపై కాదని అన్నారు. నాగరాజు ఈరోజు తన కేసు లోక్ అదాలత్‌లో చేసుకున్నాడని అతని ద్వారా మీడియా ముందు మాట్లాడించి కేసు క్లోజ్ చేశారని చెప్పారు.

రేపు జాబ్‌మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు మంగళవారం తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న ఎన్ఏసీ కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు పలు కంపెనీలు హాజరవుతున్నట్లు వివరించారు. పదవ తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బిటెక్, డిప్లొమో, ఐటీఐ పూర్తిచేసిన నిరుద్యోగ యువత తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది వీరాంజనేయులు 9160200652, శ్రీనివాసరెడ్డి 9908482907 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

14లోగా దరఖాస్తు చేసుకోండి

నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయలో ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరబడుతున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మహమ్మద్ ఫరూక్ తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించామని, ఈ నెల 14వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆరేళ్లు నిండిన చిన్నారులు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థుల ఆధార్, జనన ధృవీకరణ పత్రం తదితరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల చిన్నారులకు మొదటి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల వారీగా సీట్లు కేటాయింపు చేయబడతాయన్నారు. ఏప్రియల్ 2 వ తేదీ నుంచి రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఉన్న ఖాళీల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధించాలి

- ఆర్థిక స్వావలంబనతోనే కుటుంబ వృద్ధి
- గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా పీడీ హీరాలాల్ నాయక్



మాట్లాడుతున్న పీడీ హీరాలాల్‌నాయక్

నాదెండ్ల: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా మహిళలు పురోగతి సాధించాలని, కుటుంబ నిర్ణయాల్లో మహిళలు ప్రధాన భూమిక పోషించాలని పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ హీరాలాల్‌నాయక్ చెప్పారు. నాదెండ్ల శుభోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో హెల్త్ సబ్ కమిటీ, సోషల్ యాక్షన్ కమిటీ సభ్యులు, వీవోఏలు, ఆఫీస్ బేరర్స్‌కు మూడు రోజుల పాటూ జరగనున్న శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన లక్ష్యాలు నెరవేరాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, కుటుంబ నిర్ణయాల్లో కీలక భూమిక పోషించాలన్నారు. సామాజిక వనరులను సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకున్నప్పుడే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధ్యమౌతుందన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఇన్‌చార్జి డీబీ ప్రియదర్శిని, వన్‌స్టాప్ సకీ సెంట్రల్ లీగల్ అడ్వైజర్ కంభంపాటి వాణిశ్రీ, ఏపీఎం మేకతోటి రమేష్, సీసీలు సాంబశివరావు, హేమలత, సుధ, సాగర్, యానిమేటర్లు పాల్గొన్నారు.

పేపర్ లీక్ చేస్తే.. గుర్తింపు రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సాయికుమార్ డిమాండ్

నరసరావుపేట: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో పేపర్ లీకేజీకి పాల్పడిన ఘటనలో అరెస్ట్ అయిన స్వామి వివేకానంద కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో సాయి కుమార్ మాట్లాడుతూ పలుమార్లు పేపర్లు లీకేజీలకు పాల్పడిన కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని, విద్యార్థుల భవిష్యత్తును విచ్ఛిన్నం చేసేందుకు కళాశాల యాజమాన్యం అవినీతికి పాల్పడుతుందని విమర్శించారు. చదువుకొని పరీక్షలు రాయాల్సిన విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. ఇటువంటి ఘటనలు ఎంతో కష్టపడి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి చదువుకున్న విద్యార్థులు చాలా అవకాశాలను కోల్పోతారన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందన్నారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. బీఈడీ కళాశాలలు మొదలుకొని పరీక్షలు వరకు రాష్ట్రంలో ఉన్న పలు కళాశాలలో పేపర్ లీకేజీలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి ఘటనలపై యూనివర్సిటీలపై ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ చూపించకపోవటంతో లోపాయి కారి ఒప్పందాలతో యూనివర్సిటీ అధికారులు పాల్పడుతున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి పేపర్ లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జరిమానాలు కాకుండా ఆయా కళాశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

ప్రతి రైతు ఫాంపాండ్ ఏర్పాటు చేసుకోవాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ సిద్ధ లింగమూర్తి



ప్రజావేదికలో మాట్లాడుతున్న సిద్ధలింగమూర్తి

వెల్దుర్తి: ప్రతీ ఒక్క రైతు తమ పొలంలో ఫాంపాండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ సిద్ధ లింగమూర్తి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2023-24 సంవత్సరంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, పంచాయితీ రాజ్‌శాఖ పరిధిలో జరిగిన పనులపై సామాజిక తనిఖీల బృందం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 401 పనులకు గాను వేతనంగా రూ.7,03,58,938 /-లు, మెటల్ పనులకు రూ. 60,06,910/-లు మొత్తం రూ.7,63,65,848/-లు పంచాయితీరాజ్ డిపార్ట్‌మెంట్ కింద 135 పనులకు రూ. 2499/-లు, మెటల్ పనులకు రూ 2,25,37,721/-లు మొత్తం రూ.2,25,40,220/-ల పనులు జరిగాయన్నారు. ఈ పనులపై గ్రామసభల ను ఏర్పాటు చేసి ప్రజావేదికను నిర్వహించటం జరి గిందన్నారు. కొత్త పుల్లారెడ్డి గూడెంకు చెందిన రామచంద్రనాయక్ తనకు ఆరు సంవత్సరాల నుంచి జాబ్ కార్డు లేదని తెలిపినప్పటికీ ఎవరూ స్పందించలేదని పీడీ దృష్టికి తీసుకురావటంతో అర్ధగంటలోనే జాబ్ కార్డును తయారు చేసి ఆయనకు ఇవ్వటం జరిగింది. రామచంద్రనాయక్‌ను పీడీ లింగమూర్తి మీ పొలంలో ఫాంపాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆయన వెంటనే మా పొలంలో ఫాంపాండ్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. ఉపాధి హామీ సిబ్బంది రైతులను చైతన్యపరిచి పంట పొలాలలో ఫాంపాండ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. వెనుకబడిన వెల్దుర్తి మండలంలో హార్టీకల్చర్ ద్వారా పండ్ల మొక్కలను నాటినప్పటికీ అవి బ్రతకటం లేదన్నారు. రైతులు పాంపాండ్‌ను ఏర్పాటు చేసుకుంటే కొంత వరకైనా పండ్ల మొక్కలను బ్రతికించుకోవచ్చన్నారు. 20 గ్రామ పంచాయతీలలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ బృందాలు గ్రామ సభలు నిర్వహించి పనులు జరిగిన విధానాలను ప్రజావేదికలో వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ ఏపీడీ కొరటా మల్లిఖార్జునరావు, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ కోటమ్మ, స్టేట్ రిసోర్స్‌పర్సన్ లోకేష్, ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఇ శ్రీనివాసరెడ్డి, ఏపీవో రేఖాజ్యోతి, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం గ్రామంలో మైనింగ్ చేసుకునేందుకు దాఖలైన దరఖాస్తులపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును నిర్వహించారు. సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి నజియా బేగంతో కలిసి ప్రజాభిప్రాయాలను సేకరించారు. పాపయపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 338-7-3, 338-7-4, 338-7-5, 338-7-6, 338-7-7, 338-7-8 లలో గల 6 ఎకరాలలో రాధాకృష్ణ మినరల్స్ సంస్థ మైనింగ్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మైనింగ్ సంస్థ గ్రామాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని, స్థానిక యువకులకు ఉద్యోగాలివ్వాలని, గ్రామంలో రహదారులు మరమ్మతులు చేయించాల, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు.